తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం - 31 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 363 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# మీటర్లు పెడితే ఉరే దిక్కు

2లో

## వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి

### రైతులకు ఇబ్బందులు రాకూడదు
### ధాన్యం తరలింపుపై సమీక్ష
### అధికారులకు మంత్రి ఆదేశాలు

**సంగారెడ్డి, మే 30 (తెలంగాణ ముచ్చట్లు):**

జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్తో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులతో మంత్రి

మిగతా 2లో..



## టీజీ ఎడ్‌సెట్ ఫలితాల విడుదల

- తొంబై ఆరు శాతం ఉత్తీర్ణత
- అజిత్ సాయి ప్రథమ ర్యాంకు
- బీఈడీ ప్రవేశాలకు అర్హత

**హైదరాబాద్, మే 30 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీ ఎడ్‌సెట్-2026 ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, కాకతీయ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య ప్రతాప్ రెడ్డి శనివారం ఫలితాలను ప్రకటించారు. ఈ ఏడాది పరీక్షలో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైనట్లు తెలిపారు. టీజీ ఎడ్‌సెట్-2026కు మొత్తం 35,600 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 29,342 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష రాసిన వారిలో 28,446 మంది అర్హత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో మొత్తం ఉత్తీర్ణత శాతం 96.95గా నమోదైంది.

మిగతా 2లో..



## ఉద్యమకారుల గౌరవానికి ప్రత్యేక కమిటీ



### సచివాలయంలో తొలి సమావేశం
### అఖిలపక్ష సమావేశానికి నిర్ణయం
### అర్హుల గుర్తింపుపై కార్యాచరణ

**హైదరాబాద్, మే 30 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో తొలి సమావేశం నిర్వహించింది. కమిటీ చైర్మన్ కే. కేశవరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొని విధివిధానాలు, సమాచార సేకరణ, అర్హుల గుర్తింపు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఏర్పాటు చేసిన ఈ కమిటీ తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించడమే లక్ష్యంగా పనిచేయనుంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలను అధికారికంగా గుర్తించి చరిత్రలో నిలిపేలా చర్యలు చేపట్టాలని

మిగతా 2లో..

## ఉదయాన్నే ఆవిర్భావ వేడుకలు

### ఎండలతో సమయం మార్పు
### ఉదయం ఎనిమిదిన్నరకే ప్రారంభం
### అతిథులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

**హైదరాబాద్, మే 30 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న మండుటెండల నేపథ్యంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉదయం పూట నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజలు, అతిథులు ఎండల కారణంగా ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జూన్ 2న హైదరాబాద్‌లోని పేరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉదయం 8.30 గంటలకు ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

మిగతా 2లో..



## క్రీడాభివృద్ధిపై గవర్నర్‌తో భేటీ

### లోక్‌భవన్‌లో మర్యాదపూర్వక సమావేశం
### యువ క్రీడాకారుల ప్రోత్సాహంపై చర్చ
### క్రీడా వ్యవస్థ బలోపేతానికి సూచనలు

**హైదరాబాద్, మే 30 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఉపాధ్యక్షురాలు, మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాలా దేవి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను శనివారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధి, యువ ప్రతిభను ప్రోత్సహించడం, క్రీడా మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. సమావేశంలో తెలంగాణలో క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేసే అవకాశాలపై

మిగతా 2లో..





## పట్టణ పేదలకు ఇందిరమ్మ ఇళ్ల వరం

- తొలి విడతలో లక్ష ఇళ్లు
- ఏడాదిలోగా నిర్మాణాల పూర్తి
- బంజారాహిల్స్‌లో నూతన భవనాలకు శంకుస్థాపన
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మే 30 (తెలంగాణ ముచ్చట్లు):**

పట్టణ ప్రాంత పేదలకు నాణ్యమైన గృహ వసతి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపడుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పట్టణ పేదలకు పెద్దఎత్తున ఇళ్లు నిర్మించి అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బంజారాహిల్స్‌లో నిర్మించనున్న సమీకృత ఉప రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి మాట్లాడారు. తొలి విడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇప్పటికే ఆమోదం లభించిందని, త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన

మిగతా 2లో..

## కాంగ్రెస్‌ను బొంద పెట్టేందుకు ప్రజలు సిద్ధం

### మహాధర్నాలో కేటీఆర్ ఘాటు విమర్శలు
### జీవో పదిహేడు రద్దు చేయాలని డిమాండ్
### బడుగు వర్గాల హక్కులకై పోరాటం

**హైదరాబాద్, మే 30 (తెలంగాణ ముచ్చట్లు):**

ఇందిరాపార్కు వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో

మిగతా 2లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మీటర్లు పెడితే ఉరే దిక్కు

- ఉరితాళ్లతో రైతుల నిరసన
- మోటార్లకు మీటర్లపై ఆందోళన
- కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు

**ముఖరా(కే), మే 30 (తెలంగాణ ముచ్చట్లు):** వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసే అవకాశాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ ముఖరా(కే) గ్రామ రైతులు వినూత్న నిరసన చేపట్టారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చేతుల్లో ఉరితాళ్లు పట్టుకొని నిరసన వ్యక్తం చేసిన రైతులు, మోటార్లకు మీటర్లు అమర్చితే రైతుల జీవితాలు మరింత కష్టాల్లో పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రైతులకు ఇరవై నాలుగు గంటల ఉచిత విద్యుత్ అందించడంతో వ్యవసాయ రంగానికి ఎంతో మేలు జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేసినప్పటికీ అప్పటి ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆ నిర్ణయాన్ని అమలు చేయలేదని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కలిసి వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోందనే అనుమానం తమకు కలుగుతోందని రైతులు ఆరోపించారు. మీటర్లు అమలు చేస్తే విద్యుత్ చార్జీల భారం పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో రైతులు ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్నారని నిరసనకారులు పేర్కొన్నారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు కాలేదని, రైతు భరోసా పథకం ప్రయోజనాలు అందరికీ చేరడం లేదని, పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో మోటార్లకు మీటర్లు అమలు చేస్తే రైతులపై మరింత భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని రక్షించాలంటే ఉచిత విద్యుత్ విధానాన్ని కొనసాగించాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే చర్యలను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, దత్త, మారోతి, ప్రహ్లాద్, వెంకటి, తులసిరామ్, తిరుపతి, విఠల్‌తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

# పట్టణ పేదలకు ఇందిరమ్మ ఇళ్ల వరం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. ఏడాది వ్యవధిలోనే ఈ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. గతంలో మాదిరిగా పేదలకు నగరాలకు దూరంగా ఇళ్లు కేటాయించే విధానం ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఆధునిక సదుపాయాలతో ఇళ్లు నిర్మించి అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఆయా ప్రాంతాల ప్రజలకు అదే నియోజకవర్గ పరిధిలో గృహాలు అందించే విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు ఒకే చోట అందుబాటులో ఉండేలా సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామని మంత్రి వివరించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, సర్వే తదితర శాఖలకు సంబంధించిన సేవలను ఒకే వేదికపై అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆధునిక సౌకర్యాలను కల్పించి కార్పొరేట్ స్థాయి సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. మూడు కార్పొరేషన్ల పరిధిలోని పదమూడు ఉప రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునికీకరించే కార్యక్రమం కొనసాగుతోందని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడకుండా ప్రముఖ నిర్మాణ సంస్థల ద్వారా ఈ ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని తెలిపారు. బంజారా హిల్స్ సమీకృత భవనాన్ని కొద్ది నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీకృత కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలతో పాటు ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కూడా పెరుగుతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ సునీల్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను బొంద పెట్టేందుకు ప్రజలు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)



విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వర్గాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా చిన్న కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వమే కారణమని విమర్శించారు. ఎన్నికల సమయంలో చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్ల పేరుతో ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రభుత్వ కాంట్రాక్టుల్లో కల్పిస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని కేటీఆర్ గుర్తు చేశారు. మొత్తం 72 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వర్గాలకు 72 పైసలు కూడా ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. బడుగు వర్గాల ఆర్థిక పురోగతికి తోడ్పడాల్సిన ప్రభుత్వం వారిని మరింత వెనక్కి నెట్టే విధంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలకు సరఫరా చేసే కూరగాయలు, పాలు, చికెన్, బ్రెడ్ వంటి వస్తువుల టెండర్లు స్థానిక చిన్న కాంట్రాక్టర్లకు దక్కకుండా జీవో నంబర్ 17ను తీసుకొచ్చారని కేటీఆర్ ఆరోపించారు. ఈ జీవో ద్వారా చిన్న కాంట్రాక్టర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడిందని అన్నారు. పెద్ద కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. జీవో 17ను వెంటనే రద్దు చేయాలని, బడుగు బలహీన వర్గాలకు కాంట్రాక్టుల్లో న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం కాంట్రాక్టుల వ్యవస్థ పూర్తిగా కొందరి చేతుల్లోకి వెళ్లిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ ప్రాజెక్టులు, భారీ కాంట్రాక్టులు కొద్దిమందికే కేటాయిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చేసిన అప్పులు, చిన్న కాంట్రాక్టర్లకు విడుదల చేసిన నిధులు, కేటాయించిన పనులపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల డబ్బు ఎక్కడ ఖర్చు చేశారో ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కేటీఆర్ ప్రస్తావించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సంపద సృష్టించి పేదలకు పంచే విధానాన్ని అమలు చేశామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు, గురుకుల విద్యాసంస్థలు, రైతుబంధు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, ఇరవై నాలుగు గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. బడుగు వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, చిన్న వ్యాపారులు, కాంట్రాక్టర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని కేటీఆర్ అన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో బడుగు వర్గాల సమస్యలపై మరింత బలంగా పోరాటం చేస్తామని ప్రకటించారు. అవసరమైతే ఢిల్లీ వరకు వెళ్లి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. 2028లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఆ సమయంలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన వేలాది మంది యువతను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దే ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. గతంలో పదివేల మందికి అవకాశాలు కల్పించినట్లే భవిష్యత్తులో యాభై వేల మందికి పైగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. బడుగు వర్గాల హక్కుల కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని, వారి సంక్షేమం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఉద్యమకారుల గౌరవానికి ప్రత్యేక కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉద్యమంలో వివిధ దశల్లో పాల్గొన్న వ్యక్తుల వివరాలను సేకరించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఉద్యమంలో జైలు శిక్షలు అనుభవించిన వారు, పోలీసు కేసులు ఎదుర్కొన్న వారు, మేధావులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టులు, న్యాయవాదులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికులు, సింగరేణి కార్మికులు సహా ఉద్యమానికి తోడ్పడిన ప్రతి ఒక్కరిని గుర్తించేలా ప్రమాణాలు రూపొందించాలని సమావేశంలో చర్చించారు. అమరవీరుల కుటుంబాలకు కూడా సముచిత గుర్తింపు లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూన్ 4న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. వివిధ వర్గాల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించి పారదర్శక విధానంలో అర్హుల జాబితా రూపొందించనున్నారు. ఈ ప్రక్రియలో ఎలాంటి విమర్శలకు తావు లేకుండా నిష్పాక్షికంగా వ్యవహరించాలని కమిటీ స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరఫున తగిన గౌరవం, గుర్తింపు కల్పించేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న ప్రభుత్వం ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి చరిత్రలో నిలిపే బాధ్యతను నెరవేర్చుతుందని నాయకులు పేర్కొన్నారు. సమావేశంలో పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొని సమాచార సేకరణ ప్రక్రియపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# టీజీ ఎడ్‌సెట్ ఫలితాల విడుదల

(మొదటి పేజీ తరువాయి)

గతంతో పోలిస్తే ఈసారి కూడా విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు.

ఈ పరీక్షలో బానోత్ అజిత్ సాయి ప్రథమ ర్యాంకు సాధించి రాష్ట్ర స్థాయి టాపర్‌గా నిలిచారు. ఫలితాలు ప్రకటించగానే విజయవంతమైన అభ్యర్థులకు అధికారులు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టాలనుకునే వేలాది మంది విద్యార్థులకు ఈ ఫలితాలు కీలకంగా మారాయి. ఎడ్‌సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు రాష్ట్రంలోని వివిధ విద్యా కళాశాలల్లో రెండేళ్ల బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత పొందుతారు. త్వరలో నిర్వహించనున్న ప్రవేశాల కౌన్సెలింగ్‌కు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను సంబంధిత అధికారులు ప్రకటించనున్నారు. విద్యార్థులు అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఫలితాల ఆధారంగా ర్యాంకుల ప్రకారం కళాశాలల కేటాయింపు ప్రక్రియ చేపట్టనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ బీఈడీ కళాశాలల్లో అందుబాటులో ఉన్న సీట్లకు అభ్యర్థులు పోటీ పడనున్నారు. విద్యా రంగంలో భవిష్యత్తు నిర్మించుకోవాలనుకునే అభ్యర్థులకు ఇది కీలక దశగా నిలవనుంది. అభ్యర్థులు తమ ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఫలితాలకు సంబంధించిన పూర్తి వివరాలు, ర్యాంకులు, ఇతర సమాచారం అధికారిక పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. కౌన్సెలింగ్ ప్రక్రియపై త్వరలో ప్రత్యేక ప్రకటన విడుదల కానుంది.

## వర్షా కాల పార్లమెంట్ సమావేశాల్లో ఆర్డినెన్స్‌తో టెట్ మినహాయింపు కల్పించాలి

- పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు



**వనపర్తి,మే30(తెలంగాణ ముచ్చట్లు):** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సమీక్షా పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని, వారికి ఉపశమనం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఆర్డినెన్స్ లేదా శాసన సవరణ తీసుకురావాలని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ నిబంధనలు, నోటిఫికేషన్ల ప్రకారం నియమితులై ఎన్నో సంవత్సరాలుగా విద్యార్థులకు సేవలందిస్తున్న ఉపాధ్యాయులు ప్రస్తుతం అనిశ్చిత పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఈ పరిస్థితి ఉపాధ్యాయుల జీవనోపాధితో పాటు విద్యా వ్యవస్థ స్థిరత్వంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. గతంలో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడేందుకు శాసన పరమైన చర్యలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయని గుర్తుచేసిన ఆయన, ప్రభావిత ఉపాధ్యాయుల సేవా భద్రతను పరిరక్షించేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. లక్షలాది మంది ఉపాధ్యాయుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, వారికి టెట్ నుంచి మినహాయింపు కల్పించే విధంగా ఆర్డినెన్స్ తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు పలుస శంకర్ గౌడ్ తెలిపారు.

## వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం ఎంత మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరిందో, ఇప్పటివరకు ఎంత మేర కొనుగోలు జరిగిందో, ఎంత ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతుల ఖాతాల్లో కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు సకాలంలో జమ అవుతున్నాయా లేదా అనే అంశంపై కూడా వివరాలు సేకరించారు.

ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాల లభ్యత, రవాణా ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీసిన మంత్రి, ఎక్కడా జాప్యం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి నిల్వ సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద తగిన రక్షణ చర్యలు చేపట్టి రైతుల పంట నష్టపోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, సబ్ కలెక్టర్ ఉమాహారతి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉదయాన్నే ఆవిర్భావ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం సమయాన్ని కుదించి సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

జాతీయ పతాకావిష్కరణతో పాటు అవతరణ దినోత్సవానికి సంబంధించిన అన్ని కార్యక్రమాలను గంటన్నర వ్యవధిలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహ్వానితులు, సాధారణ ప్రజలకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. తాగునీరు, వైద్య సదుపాయాలు, నీడ ఏర్పాట్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్నా వేళల్లో కార్యక్రమాలు నిర్వహించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పాటు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## క్రీడాభివృద్ధిపై గవర్నర్‌తో భేటీ

(మొదటి పేజీ తరువాయి)

సమగ్రంగా చర్చ జరిగినట్లు సమాచారం. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ, సౌకర్యాలు అందించే అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. యువ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత విస్తరించి, పాఠశాల స్థాయి నుంచే క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించే కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆధునిక శిక్షణ కేంద్రాల ఏర్పాటు, ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించే అంశాలపై కూడా సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. రాష్ట్రంలోని క్రీడా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చేపడుతున్న కార్యక్రమాల గురించి సోనిబాలా దేవి గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం. యువతను క్రీడల వైపు ఆకర్షించేందుకు అమలు చేస్తున్న పథకాలు, శిక్షణ కార్యక్రమాల పురోగతిని తెలియజేశారు. రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం, క్రీడా సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. భవిష్యత్తులో తెలంగాణ దేశానికి మరింత మంది ప్రతిభావంతులైన క్రీడాకారులను అందించే రాష్ట్రంగా ఎదగాలని గవర్నర్ ఆకాంక్షించినట్లు అధికారులు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సన్మానించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం బ్యూరో, మే 30(తెలంగాణ ముచ్చట్లు ):**ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలందించారారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన వారుబి. నాగేశ్వర్ రావు, ఎస్ ఐ ఉమెన్ పిఎస్ , ఎన్. ఉప్పయ్య, ఏఎస్ఐ ఖమ్మం II టౌన్ ఎం. గురునాథం, ఏఎస్ఐ ముదిగొండ పి. ప్రకాష్ రావు, హెచ్ సి మదిర టౌన్పి. లక్ష్మణ్ రావు (ఎస్సై కమ్యూనికేషన్) కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ ఐ లు కామరాజు, అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 68 లక్షల మోసం.. బిల్డర్‌పై బాధితురాలి ఆరోపణలు




**ఖమ్మం బ్యూరో , మే 30(తెలంగాణ ముచ్చట్లు ):**ఖమ్మం రూరల్ మండలంలోని చిన్న వెంకటగిరి మహాలక్ష్మి టౌన్‌షిప్‌లో ఇల్లు నిర్మిస్తానని నమ్మించి రూ.68 లక్షలు తీసుకుని మోసం చేశాడంటూ బిల్డర్ మొర్రినేకల సత్యనారాయణపై బాధితురాలు కామా కళావతి ఆరోపించారు. శనివారం గట్టయ్య సెంటర్‌లోని ఖమ్మం జిల్లా ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె తన గోడును వెల్లడించారు.

కామా కళావతి మాట్లాడుతూ, ఎదులాపురం 12వ వార్డు మాజీ కార్పొరేటర్‌గా పరిచయం చేసుకున్న మొర్రినేకల సత్యనారాయణ తమకు ప్లాట్, బోర్‌వెల్, భవన నిర్మాణం పూర్తి చేసి అప్పగిస్తానని హామీ ఇచ్చి రూ.68 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడని తెలిపారు. అడ్వాన్స్‌తో పాటు బ్యాంకు రుణం ద్వారా మొత్తం రూ.63 లక్షలు చెల్లించిన అనంతరం గత నవంబర్‌లో గృహప్రవేశం కూడా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

అయితే ఇంటికి సంబంధించిన అనేక పనులు పూర్తి కాకపోవడంతో బిల్డర్‌ను పలుమార్లు సంప్రదించినా స్పందించలేదని ఆరోపించారు. ఇంటి బోర్‌వెల్‌లో నీరు రాకపోవడంతో పరిశీలించగా కేవలం 20 అడుగుల లోతులోనే బోర్ వేసిన విషయం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. కనీసం 250 అడుగుల లోతు లేకుండా నీరు వచ్చే అవకాశం లేదని తెలిసినా తమను ఉద్దేశపూర్వకంగా మోసం చేశారని ఆరోపించారు. దీనిపై ప్రశ్నించగా బెదిరింపులకు పాల్పడటమే కాకుండా ప్రాణహాని హెచ్చరికలు చేశాడని వాపోయారు.

ఈ విషయమై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డర్ కారణంగా తమకు సుమారు రూ.10 లక్షల మేర అదనపు నష్టం వాటిల్లిందని, నెలకు రూ.50 వేల ఈఎంఐ చెల్లిస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. బిల్డర్ మొర్రినేకల సత్యనారాయణపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

## డిజిపిని కలిసిన కూనంనేని



**ఖమ్మం బ్యూరో, మే 30(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ రాష్ట్ర డిజిపిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ ను కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ ఇతర అంశాలపై చర్చించారు. సివి ఆనంద్ పాలనలో పోలీసులు మరింత సమర్ధవంతంగా సేవలు అందించాలని రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా జీవించాలని కూనంనేని ఆకాంక్షించారు. కూనంనేని వెంట సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్కె జానిమియా తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం





**వేలేరు, మే 30 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలో అంబేద్కర్ విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో, బొల్లం రాజు నాయకత్వంలో పదో తరగతి విద్యార్థులకు నెల రోజులపాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు బిల్లా యాదగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు.అనంతరం సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ, విద్యార్థులు విద్య ద్వారానే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, క్రమశిక్షణతో చదివి జీవితంలో విజయాలను సాధించాలని సూచించారు. మొత్తం 50 మంది పదో తరగతి విద్యార్థులకు ఈ శిక్షణ అందించబడిందన్నారు.ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ శ్రీకర్ పాల్గొన్నారు. అలాగే శిక్షణ తరగతుల నిర్వహణ కోసం హాల్ భవనాన్ని అందించిన రవిని నిర్వాహకులు అభినందించారు.కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు

## శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు



**హుజురాబాద్, మే 30 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారి జన్మదిన వేడుకలను హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని కొనియాడారు. ఐటీ రంగ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో మంత్రి ఎల్లప్పుడూ ముందుంటూ ప్రజల మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పురోగతికి శ్రీధర్ బాబు చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని తెలిపారు. ఆయనకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. మంత్రి శ్రీధర్ బాబు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రసవం సజావుగానే.. ఉదయానికి శిశువు మృతి



**హుజురాబాద్, మే 30 (తెలంగాణ ముచ్చట్లు):** సైదాపూర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన రమ్య అనే గర్భిణి ప్రసవం కోసం హుజురాబాద్ ఏరియా ఆసుపత్రిలో చేరింది. శుక్రవారం రాత్రి వైద్యులు ఆమెకు సిజేరియన్ శస్త్రచికిత్స నిర్వహించగా, ఆమె ఓ మగ శిశువుకు జన్మనిచ్చింది. ప్రసవ సమయంలో తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు.

అయితే శనివారం ఉదయం నిద్రలేచి చూసేసరికి శిశువులో ఎలాంటి కదలికలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం అందించగా, పరీక్షించిన వైద్యులు శిశువు మృతి చెందినట్లు నిర్ధారించారు. రాత్రి వరకు క్షేమంగా ఉన్న నవజాత శిశువు ఉదయానికి మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఈ ఘటనపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నారాయణరెడ్డి స్పందిస్తూ, ప్రసవం సజావుగా జరిగిందని, శిశువు జన్మించిన సమయంలో పూర్తిగా ఆరోగ్యంగానే ఉన్నాడని తెలిపారు. శిశువు మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు అంతర్గత విచారణ చేపట్టామని, వార్డులోని సీసీటీవీ ఫుటేజీలను కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు.

నవజాత శిశువు మృతి ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## చిట్టీ డబ్బుల వివాదం.. యువకుడి ఆత్మహత్యాయత్నం

**జమ్మికుంట టౌన్ మే 30 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామంలో చిట్టీ డబ్బుల వివాదం ఓ యువకుడి ఆత్మహత్యాయత్నానికి దారితీసిన ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన అరుకాల సాయికుమార్ అనే యువకుడు పురుగుమందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు.

స్థానికుల వివరాల ప్రకారం, సాయికుమార్ జమ్మికుంటకు చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.6 లక్షల మేర చిట్టీ డబ్బులు కట్టినట్లు తెలిసింది. అయితే గడువు ముగిసినప్పటికీ తన డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని, తనకు చెందిన బంగారు గొలుసు, క్రెడిట్ కార్డులను కూడా తిరిగి అందించడం లేదని అతడు ఆరోపించాడు. ఈ వ్యవహారంతో తీవ్ర మనస్తాపానికి గురైన సాయికుమార్, “ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను.. అమ్మా నాన్న నన్ను క్షమించండి.. నేను చనిపోతున్నాను” అంటూ సెల్ఫీ వీడియో రికార్డు చేస్తూ పురుగుమందు సేవించినట్లు సమాచారం.

గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి అతడిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడికి చికిత్స కొనసాగుతున్నట్లు తెలిసింది.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.







## మహిళల ఆర్థికాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం: చైర్మన్ దిలీప్

**జమ్మికుంట టౌన్ మే 30 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ - ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఉమెన్స్ వీక్ కార్యక్రమంలో భాగంగా శనివారం జమ్మికుంట పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్, మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మెప్మా ఇంచార్జి టీఎంసీ మల్లీశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమంగా పనిచేసిన సమాఖ్యలు, స్వయం సహాయక సంఘాలకు పురస్కారాలు అందజేశారు. అలాగే కొత్త సంఘాల ఏర్పాటు, లోన్ మేళా కార్యక్రమాలు నిర్వహించి, 16 మహిళా సంఘాలకు సంబంధించిన రూ.1.95 కోట్ల జంబో చెక్కును అందజేశారు. మహిళా సంఘాల సభ్యులకు భవిష్యత్తులో ఎటువంటి సహాయ సహకారాలు అవసరమైనా మున్సిపాలిటీ తరఫున పూర్తి మద్దతు అందిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన వివిధ ఉత్పత్తుల స్టాల్స్‌ను పరిశీలించి వారి ప్రతిభను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి ఆర్ఎం మధర్, మేనేజర్ రాజేందర్, మున్సిపల్ కౌన్సిలర్లు కొలుగూరి సురేష్, చుంచు రమాదేవి, చందా రాజు, ఫిరోజ్, పాతకాల మౌనిక, శ్రీపతి స్వర్ణలత, మంద రాధ, ఎగిత సుజాత, దిడ్డి కోమల, సీఎల్ఆర్పీలు జ్యోతి, మంజుల, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి గీత, స్వర్ణరేఖ, టీఎల్ఎఫ్ ఆర్పీలు, ఓబీలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ఏసీబీ ట్రాప్ కేసులో నేలకొండపల్లి పూర్వ తహసిల్దారు నరసింహారావుకు జైలు శిక్ష

**ఖమ్మం బ్యూరో, మే 30(తెలంగాణ ముచ్చట్లు ):** 2011 లో నేలకొండపల్లి తహసిల్దారుగా పనిచేస్తున్న గుండ్ల నరసింహారావు వ్యవసాయ భూమికి ఎన్ఓసి జారీ చేయడానికి మూడు వేల రూపాయలు లంచం అడిగగా దీంతో బాధితుడు ఏసీబీ ని సంప్రదించాడు. ఎసిబి సిఐ వెంకటేష్ ఆధ్వర్యంలో 2011లో తాసిల్దార్ ను అరెస్ట్ చేశారు. అనంతరం శుక్రవారం 2026మే 29వ తేదీన తాసిల్దార్ కు వరంగల్ ఏసీబీ కోర్టు జడ్జ్ కే దేశ్ పాండే రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పదివేల రూపాయల జరిమానా విధించారు. ఈ ప్రాసిక్యూషన్ కి ప్రస్తుత ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎసిబి డిఎస్పి వై రమేష్ సిఐ శేఖర్ ఈ కేసులో పిపి జ్యోతి రెడ్డి కోర్ట్ కానిస్టేబుల్ నరసింహారావు సహకరించారు.

## పెద్దమందడి మండల కేంద్రంలో తాగునీటి సమస్య.. పట్టించుకోని అధికారులు

**బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి కురుమూర్తి ఆవేదన**



**పెద్దమందడి,మే30(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో గత నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి కురుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మండుతున్న ఎండల మధ్య కనీసం తాగడానికి కూడా నీరు అందక మహిళలు, వృద్ధులు ఖాళీ బిందెలతో నీటి కోసం తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.మండల కేంద్రానికి సరఫరా అయ్యే మిషన్ భగీరథ పైపులైన్లలో సాంకేతిక లోపాలు లేదా లీకేజీల కారణంగా నీటి సరఫరా నిలిచిపోయినట్లు తెలుస్తోందని కురుమూర్తి తెలిపారు. ఇప్పటికే గ్రామంలోని బావులు, బోర్లు ఎండిపోవడంతో ప్రజలకు ప్రత్యామ్నాయ నీటి వనరులు కూడా అందుబాటులో లేకుండా పోయాయని చెప్పారు. దీంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు నీటి ట్యాంకర్లను ఆశ్రయించి అదనపు భారం మోస్తున్నారని పేర్కొన్నారు.గ్రామంలో నాలుగు రోజులుగా ఇంతటి తీవ్రమైన తాగునీటి సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు స్పందించడం లేదని కురుమూర్తి విమర్శించారు. సమస్యను పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, త్వరలోనే మరమ్మతులు చేపడతామని చెబుతూ కాలయాపన చేస్తున్నారే తప్ప ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.కనీసం తాత్కాలిక చర్యగా నీటి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా కూడా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని ఆయన అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే సమస్యను పరిష్కరించి, మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించడంతో పాటు తాత్కాలికంగా నీటి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించాలని బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి కురుమూర్తి అధికారులను డిమాండ్ చేశారు.

## బోర్నపల్లిలో వారికోయ్యాలకు భారీ అగ్నిప్రమాదం



**హుజూరాబాద్, మే 30 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ మండలంలోని బోర్నపల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి వారికోయ్యాలకు ఆకస్మికంగా మంటలు అంటుకుని భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మంటలు వేగంగా వ్యాపించడంతో దట్టమైన పొగలు ఎగసిపడి పరిసర ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. మంటలను గమనించిన గ్రామస్థులు వెంటనే అప్రమత్తమై వాటిని అదుపు చేసేందుకు ప్రయత్నాలు చేపట్టారు. అయితే మంటలు తీవ్రంగా వ్యాపించడంతో పెద్ద మొత్తంలో వారికోయ్యాలు దగ్ధమైనట్లు సమాచారం. ప్రస్తుతం కూడా కొన్ని ప్రాంతాల్లో మంటలు కొనసాగుతున్నట్లు స్థానికులు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలి . ఈ ప్రమాదం జరిగిన వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి స్థాయి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

## కోర్టు వాయిదాలకు గైర్హాజరు.. నలుగురిని హుజూరాబాద్ జైలుకు తరలింపు



**భీమదేవరపల్లి:మే30(తెలంగాణ ముచ్చట్లు):** కోర్టు వాయిదాలకు సకాలంలో హాజరుకాని నలుగురు వ్యక్తులను న్యాయమూర్తి ఆదేశాల మేరకు హుజూరాబాద్ జైలుకు తరలించినట్లు ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల రవీందర్, వేల్పుల వెంకటేష్, చల్లూరి భాస్కర్‌తో పాటు కొప్పూరు గ్రామానికి చెందిన గద్ద రామరాజు తమపై నమోదైన కేసుల విచారణకు సంబంధించి కోర్టు వాయిదాలకు పదేపదే గైర్హాజరవుతున్నట్లు వెల్లడైంది. కోర్టు విచారణకు ఉద్దేశపూర్వకంగా హాజరుకావడం లేదని గుర్తించిన న్యాయమూర్తి వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో జడ్జి ఆదేశాల మేరకు పోలీసులు సదరు నలుగురిని అదుపులోకి తీసుకుని హుజూరాబాద్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# నక్ష బాట సర్వే చేపట్టాలి.. స్మశాన వాటిక భూమికి హద్దులు గుర్తించాలి

- **సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం**



**పెద్దమందడి,మే30(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ గట్టు కాలువ నుండి అడ్డాకుల పొలిమేర వరకు ఉన్న నక్ష బాటను సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని పెద్దమందడి తహసీల్దార్‌కు శనివారం వెల్టూర్ గ్రామపంచాయతీ తరపున గ్రామ సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.గ్రామ ప్రజల అవసరాలు, భూసరిహద్దుల స్పష్టత దృష్ట్యా గట్టు కాలువ నుండి అడ్డాకుల పొలిమేర వరకు ఉన్న నక్ష బాటను సంబంధిత అధికారులు సర్వే చేసి శాశ్వత హద్దులు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు.అదేవిధంగా గట్టు కాలువ నుండి తోలబండ వరకు ఉన్న 21వ సర్వే నంబరులోని అసైన్డ్ భూమిని గ్రామ స్మశాన వాటికకు కేటాయించి, ఆ భూమికి హద్దులు గుర్తించాలని తహసీల్దార్‌ను కోరారు.గ్రామాభివృద్ధి, ప్రజల సౌకర్యాల దృష్ట్యా ఈ రెండు అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, గోవర్ధన్ రెడ్డి, ముష్టి శ్రీనివాసులు, వివేక్, యాదయ్య, సత్య రెడ్డి, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త మృతి.. పార్టీకి తీరని లోటు



**పెద్దమందడి,మే30(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త పానుగంటి సామేలు తన స్వంత వ్యవసాయ పొలంలో పనిచేస్తుండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ.. కాంగ్రెస్ నాయకుల ద్వారా బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5,000/రూపాయలను అందజేశారు.ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, పానుగంటి సామేలు పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన నిబద్ధత కలిగిన కార్యకర్త అని, ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన సేవలను పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం, వార్డు సభ్యులు రాములమ్మ, హనుమంతు, కావాలి కృష్ణ, నరేష్, మాజీ సర్పంచ్ సిద్ధయ్య, తిక్కన్న, రఘుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మోసలకు పాల్పడుతున్న నిందుతుడు అరెస్ట్... రిమాండ్ తరలిపింపు

**ఏసీపీ రమణమూర్తి**



**ఖమ్మం బ్యూరో, మే 30(తెలంగాణ ముచ్చట్లు ):** కాకినాడ జిల్లా కిర్లంపూడి గ్రామానికి చెందిన ఎన్టిపిసి రామగుండం మాజీ ఉద్యోగి తోట బాలాజీ నాయుడు అనే వ్యక్తి పరిచయమై తనకు చాలామంది పరిచయస్తులు ఉన్నారని వారి ద్వారా లోన్లు ఇప్పిస్తాను అని చెప్పగా పువ్వాడ ఉదయ నగర్ గ్రామం రఘునాథపాలెం మండలం కు చెందిన వడ్లకుంట శివ అనే వ్యక్తి కుటుంబ అవసరాల నిమిత్తం 10 లక్షల రూపాయలు అవసరం ఉన్నదని, ఇప్పించమని తోట బాలాజీ నాయుడు ని అడుగగా అతను అట్టిలోను ఇప్పించుట గురించి మూడు లక్షల రూపాయలు ఖర్చు అవుతాయని చెప్పగా వడ్లకుంట శివ ఖమ్మానికి చెందిన తన స్నేహితుల ద్వారా రెండు లక్షల 50 వేల రూపాయలు ఫోన్ పే ద్వారా తోట బాలాజీ నాయుడు కి పంపినాడు.సదరు తోట బాలాజీ నాయుడు గతంలో ఎన్టిపిసి రామగుండం నందు ఏఈగా పనిచేస్తూ.. ఏసీబీ సిబిఐ వారికి లంచం తీసుకుంటూ దొరికి ఉద్యోగం నుండి తీసివేయబడినాడు. అప్పటి నుండి రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న నాయకులు లకు ఫోన్ చేసి నేను అడిషనల్ సెక్రెటరీ, ఫైనాన్స్ డిపార్ట్మెంట్, అని ఫోన్ చేసి చెప్పి ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్ గార్ యోజన మరియు చీఫ్ మినిస్టర్ అన్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ కు సంబంధించి మీ నియోజకవర్గానికి ఫండ్స్ వచ్చినవి అని మీ నియోజకవర్గ నుండి అప్లికేషన్లు పంపండి మనిషికి 2500/ రూపాయలు చలానాగా కట్టాలి నేను స్కానర్ పెడతాను పదిమందికి 25 వేల రూపాయలు చొప్పున మీరు ఎంతమందికి కావాలో అన్ని డబ్బులు నేను పెట్టిన స్కానర్ కు కొట్టమని డబ్బులు కొట్టించుకునే వాడు. సదరు తోట బాలాజీ నాయుడు గతంలో 2016 వ సంవత్సరంలో బంజారాహిల్స్ పోలీసు వారు పీడీ యాక్ట్ పెట్టి చంచల్ గూడ జైలుకి పంపినారు. అదేవిధంగా 2025 సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఫోన్ చేసి డబ్బులు తీసుకుని అట్టి కేసులో కూడా జైలుకు పోయి వచ్చినాడు. సదరు బాలాజీ నాయుడు రెండు రాష్ట్రాల్లో ఉన్న నాయకులని లక్ష్యంగా చేసుకొని వారి వద్ద నుండి మోసపూరితంగా డబ్బులు తీసుకుంటూ అదే విధంగా రఘునాధపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని పువ్వాడ ఉదయ నగర్ కు చెందిన వడ్లకుంట శివ అనే వ్యక్తిని కూడా మోసం చేసి రెండు లక్షల 50 వేల రూపాయలు నగదును క్యూఆర్ కోడ్ స్కానర్లు పెట్టి మోసపూరితంగా డబ్బులు తీసుకున్నాడు. ఇట్టి కేసుని రఘునాధపాలెం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎండి ఉస్మాన్ షరీఫ్ కేసు నమోదు చేయడం జరిగింది. ప్రస్తుతం చించు పేట, జండా చెట్టు బజార్, తెనాలి తాలూకా, గుంటూరు జిల్లాలో నివాసం ఉంటునట్లు విచారణ నిందుతుడు తెలిపారు. నిందుతుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలించడం జరిగింది అని ఏసిపి రమణమూర్తి తెలియజేశారు.

# యుద్ధప్రాతిపదికన గట్ల నర్సింగాపూర్ బ్రిడ్జి నిర్మించాలి!

- **ముంచుకొస్తున్న వర్షా కాలం.. ఆందోళనలో గ్రామస్తులు**
- **ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కి విజ్ఞప్తి**



**భీమదేవరపల్లి, మే 30 (తెలంగాణ ముచ్చట్లు):** భీమదేవరపల్లి మండలంలోని గట్ల నర్సింగాపూర్ గ్రామంలో గత ఏడాది భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రధాన బ్రిడ్జి పునర్నిర్మాణం ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో శాశ్వత వంతెన నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గత సంవత్సరం సంభవించిన భారీ వరదల కారణంగా గ్రామ శివారులోని ప్రధాన బ్రిడ్జి పూర్తిగా కూలిపోవడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాత్కాలికంగా మట్టితో డైవర్షన్ మార్గాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి గ్రామ ప్రజలు, రైతులు, విద్యార్థులు అదే మార్గం ద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రయాణిస్తున్నారు. మరో కొన్ని రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానుండటంతో గ్రామస్తుల్లో ఆందోళన మరింత పెరిగింది.

భారీ వర్షాలు కురిస్తే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి కట్ట కొట్టుకుపోయే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు. అలాంటి పరిస్థితి ఏర్పడితే గ్రామానికి బాహ్య ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గర్భిణులు, వృద్ధులు అత్యవసర వైద్య సేవల కోసం ఆసుపత్రులకు వెళ్లడంలో, విద్యార్థులు పాఠశాలలకు చేరుకోవడంలో, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు. అందువల్ల బ్రిడ్జి నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేసి, పనులను వేగవంతంగా ప్రారంభించేలా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# కనుమరుగవుతున్న మైదానాలు

- **ఆటస్థలాలు ఎటు పోతున్నాయి?**
- **పిల్లలకు తగ్గిన ఖాళీ స్థలం**
- **తెరలకే పరిమితమైన బాల్యం**
- **భవిష్యత్తుకు హెచ్చరిక సంకేతం**

ఒకప్పుడు ప్రతి గ్రామంలో, ప్రతి కాలనీలో పిల్లల కేరింతలతో మారుమోగే ఆటస్థలాలు నేడు క్రమంగా కనుమరుగవుతున్నాయి. సాయంత్రం సమయం రాగానే మైదానాల్లో క్రికెట్, కబడ్డీ, కోకో, వాలీబాల్ వంటి ఆటలు ఆడే పిల్లలు కనిపించేవారు. అయితే ఇప్పుడు ఆ దృశ్యాలు అరుదుగా మారుతున్నాయి. ఒకవైపు పట్టణీకరణ వేగంగా విస్తరిస్తుండగా, మరోవైపు ఖాళీ స్థలాలు భవనాలుగా మారిపోతున్నాయి. దీంతో పిల్లలకు స్వేచ్ఛగా ఆడుకునే ప్రదేశాలు తగ్గిపోతున్నాయి. సమాజం అభివృద్ధి చెందుతున్నప్పటికీ, బాల్యాన్ని తీర్చిదిద్దే ఆటస్థలాలు క్రమంగా అదృశ్యమవడం ఆందోళన కలిగించే పరిణామంగా మారింది. నేటి పిల్లల జీవితంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోంది. స్మార్ట్‌ఫోన్లు, టాబ్లెట్లు, వీడియో గేమ్‌లు వారి రోజువారీ జీవితంలో భాగమయ్యాయి. ఒకప్పుడు బయట మైదానాల్లో గడిపే సమయం ఇప్పుడు మొబైల్ తెరల ముందు గడుస్తోంది. తల్లిదండ్రులు కూడా భద్రత, చదువుల ఒత్తిడి వంటి కారణాలతో పిల్లలను బయటకు పంపడంలో వెనుకంజ వేస్తున్నారు. ఫలితంగా పిల్లలు శారీరక కదలికలకు దూరమవుతున్నారు. ఇది కేవలం ఒక అలవాటు మార్పు మాత్రమే కాదు, భవిష్యత్తు ఆరోగ్యంపై ప్రభావం చూపే సామాజిక సమస్యగా మారుతోంది. ఆటలు పిల్లల శారీరక వికాసానికి మాత్రమే కాదు, మానసిక ఎదుగుదలకు కూడా అవసరం. మైదానాల్లో ఆడటం ద్వారా పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, జట్టు భావన, ఓటమిని తట్టుకునే సామర్థ్యం, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలు పెరుగుతాయి. కానీ ఆటస్థలాలు లేకపోవడంతో ఈ అవకాశాలు తగ్గిపోతున్నాయి. పుస్తక జ్ఞానం ఎంత ముఖ్యమో, ఆటల ద్వారా లభించే జీవిత అనుభవం కూడా అంతే ముఖ్యమైనది. ఈ విషయాన్ని సమాజం మరచిపోతున్నట్లు కనిపిస్తోంది. పట్టణాల్లో భూముల విలువ పెరగడం కూడా ఆటస్థలాల కొరతకు ప్రధాన కారణంగా మారింది. ఒకప్పుడు పిల్లలు ఆడుకునే ఖాళీ స్థలాలు ఇప్పుడు అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాలతో నిండిపోతున్నాయి. నగర ప్రణాళికలో ఆటస్థలాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. కొన్నిచోట్ల పేరుకే పార్కులు ఉన్నా, అవి కూడా చిన్నవిగా ఉండటం వల్ల పెద్ద సంఖ్యలో పిల్లలు ఉపయోగించుకునే అవకాశం ఉండడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పరిస్థితి మారుతోంది. ఒకప్పుడు పాఠశాల మైదానాలు, గ్రామ శివార్లు పిల్లల ఆటలకు కేంద్రాలుగా ఉండేవి. ఇప్పుడు అక్కడ కూడా చదువుల పోటీ, సాంకేతిక ప్రభావం కారణంగా ఆటల పట్ల ఆసక్తి తగ్గుతోంది. గ్రామాల్లో ఖాళీ స్థలాలు ఉన్నప్పటికీ, వాటిని ఉపయోగించుకునే పిల్లల సంఖ్య తగ్గిపోతోంది. ఇది భవిష్యత్తులో క్రీడా ప్రతిభపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆటస్థలాల కొరత కారణంగా పిల్లల్లో ఊబకాయం, మధుమేహం, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు పెరుగుతున్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలు కనిపిస్తున్నాయి. రోజంతా గదుల్లోనే గడపడం వల్ల ప్రకృతితో పిల్లల అనుబంధం కూడా తగ్గిపోతోంది. ఇది వారి భావోద్వేగ వికాసంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, విద్యాసంస్థలు కలిసి ఆటస్థలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి కాలనీ, ప్రతి గ్రామంలో పిల్లలకు అందుబాటులో ఉండే మైదానాలను అభివృద్ధి చేయాలి. పాఠశాలల్లో క్రీడలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలను బయట ఆటలకు ప్రోత్సహించాలి. కేవలం మార్కులే కాకుండా ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం కూడా ముఖ్యమని గుర్తించాలి. ఆటస్థలాలు కేవలం ఖాళీ ప్రదేశాలు కావు. అవి పిల్లల కలలకు, స్నేహాలకు, ఆరోగ్యానికి, భవిష్యత్తుకు పునాదులు. ఒక తరం ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో ఎదగాలంటే వారికి ఆడుకునే స్వేచ్ఛ, తగిన ప్రదేశాలు తప్పనిసరిగా ఉండాలి. అభివృద్ధి పేరుతో ఆటస్థలాలు కనుమరుగైతే, భవిష్యత్తులో మనం కోల్పోయేది కేవలం మైదానాలు మాత్రమే కాదు, ఆరోగ్యవంతమైన బాల్యాన్ని కూడా. అందుకే ఆటస్థలాల సంరక్షణను సమాజం అత్యవసర బాధ్యతగా గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.

# పొగాకు ముప్పుపై పోరాటం

- **వ్యసనం వెనుక విషచక్రం**
- **యువత భవిష్యత్తుకు ప్రమాదం**
- **సమష్టి కృషితోనే పరిష్కారం**

ఆధునిక ప్రపంచం ఎన్నో రంగాల్లో అద్భుతమైన పురోగతి సాధిస్తున్నప్పటికీ, మానవ ఆరోగ్యాన్ని నిశ్శబ్దంగా కబళిస్తున్న కొన్ని సమస్యలు మాత్రం ఇప్పటికీ సమాజాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. వాటిలో పొగాకు వినియోగం అత్యంత ప్రమాదకరమైనది. ప్రతి సంవత్సరం ప్రపంచ యాంటీ టొబాకో డే సందర్భంగా ప్రభుత్వాలు, వైద్య సంస్థలు, స్వచ్ఛంద సంఘాలు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయినప్పటికీ పొగాకు వినియోగం పూర్తిగా తగ్గకపోవడం ఆందోళన కలిగించే అంశం. ఒకవైపు పొగాకు వల్ల కలిగే ప్రమాదాల గురించి అందరికీ తెలిసినా, మరోవైపు ఆ అలవాటు నుంచి బయటపడలేకపోతున్న వారి సంఖ్య గణనీయంగానే ఉంది. ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాదు, సామాజిక, ఆర్థిక, ఆరోగ్య రంగాలను ప్రభావితం చేస్తున్న జాతీయ సవాలుగా మారింది. పొగాకు ఉత్పత్తులు మనిషి శరీరాన్ని నెమ్మదిగా నాశనం చేసే విషపదార్థాలుగా వైద్య శాస్త్రం చాలా కాలం క్రితమే నిర్ధారించింది. ధూమపానం చేసే వ్యక్తుల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. గుట్కా, జర్దా వంటి నమిలే పొగాకు ఉత్పత్తులు నోటి క్యాన్సర్‌కు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. విచారకరమైన విషయం ఏమిటంటే, పొగాకు వినియోగం వల్ల కలిగే నష్టం వెంటనే కనిపించదు. అందుకే చాలా మంది దానిని పెద్ద ప్రమాదంగా పరిగణించరు. కానీ సంవత్సరాల తరబడి కొనసాగిన ఈ అలవాటు చివరికి ప్రాణాలనే బలితీసుకునే స్థాయికి చేరుకుంటుంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే పొగాకుకు పూర్తిగా దూరంగా ఉండటమే ఏకైక మార్గమని నిపుణులు పదేపదే చెబుతున్నా, ఆ సందేశం అందరికీ చేరడం లేదు. ఇటీవలి కాలంలో యువతలో పొగాకు వినియోగం పెరుగుతుండటం మరింత ఆందోళనకర అంశం. ఒకప్పుడు పెద్దవారికే పరిమితమైన ఈ అలవాటు ఇప్పుడు విద్యార్థుల వరకు విస్తరిస్తోంది. స్నేహితుల ప్రభావం, సామాజిక ఒత్తిడి, ఆధునికత పేరుతో కొందరు యువకులు ధూమపానాన్ని ఒక ఆకర్షణీయమైన అలవాటుగా భావిస్తున్నారు. సినిమాలు, సామాజిక మాధ్యమాలు, కొన్ని వాణిజ్య ప్రకటనలు కూడా పరోక్షంగా ఈ ధోరణికి బలం చేకూరుస్తున్నాయని విమర్శలు ఉన్నాయి. యుక్తవయస్సులో ప్రారంభమైన వ్యసనం జీవితాంతం వెంటాడే ప్రమాదం ఉంటుంది. అందుకే పాఠశాల స్థాయి నుంచే ఆరోగ్య విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం, పొగాకు దుష్ప్రభావాలపై అవగాహన పెంచడం అత్యవసరం. పొగాకు వల్ల కలిగే నష్టం కేవలం వినియోగదారుడికే పరిమితం కాదు. ధూమపానం చేసే వ్యక్తి చుట్టూ ఉన్నవారు కూడా దాని ప్రభావానికి గురవుతారు. కుటుంబ సభ్యులు, చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు పరోక్ష ధూమపానం వల్ల



అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. అంటే ఒక వ్యక్తి తీసుకునే చెడు నిర్ణయం మొత్తం కుటుంబం ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఇది వ్యక్తిగత స్వేచ్ఛ పరిధిని దాటి ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. అందుకే ప్రపంచంలోని అనేక దేశాలు బహిరంగ ప్రదేశాల్లో ధూమపానంపై కఠిన నిబంధనలు అమలు చేస్తున్నాయి. ప్రజారోగ్య పరిరక్షణలో ఇటువంటి చర్యలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. ఆరోగ్య సమస్యలతో పాటు పొగాకు ఆర్థికంగా కూడా భారంగా మారుతోంది. రోజూ సిగరెట్లు, గుట్కా వంటి ఉత్పత్తుల కోసం ఖర్చు చేసే చిన్న మొత్తాలు కాలక్రమంలో భారీ వ్యయంగా మారతాయి. వ్యసనం కారణంగా ఉత్పాదకత తగ్గిపోవడం, అనారోగ్యంతో ఉద్యోగాలకు దూరమవడం, వైద్య చికిత్సల కోసం అధికంగా ఖర్చు చేయాల్సి రావడం వంటి సమస్యలు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తాయి. ఒక వ్యక్తి పొగాకు మానేయడం ద్వారా కేవలం తన ఆరోగ్యాన్నే కాదు, తన కుటుంబ ఆర్థిక భవిష్యత్తును కూడా కాపాడగలడు. ఈ విషయాన్ని సమాజం మరింత లోతుగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. పొగాకు నియంత్రణలో ప్రభుత్వాల పాత్ర కూడా అత్యంత కీలకం. హెచ్చరిక చిత్రాలు, అధిక పన్నులు, అమ్మకాలపై పరిమితులు, విద్యాసంస్థల సమీపంలో విక్రయాల నిషేధం వంటి చర్యలు ఇప్పటికే అమల్లో ఉన్నాయి. అయితే చట్టాలు మాత్రమే సరిపోవు. వాటి అమలు కూడా సమర్థంగా ఉండాలి. ముఖ్యంగా చిన్నారులకు, యువతకు పొగాకు ఉత్పత్తులు చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. అక్రమ విక్రయాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. ప్రజల్లో అవగాహన పెరగడం, చట్టాలు కఠినంగా అమలవడం రెండూ సమాంతరంగా సాగినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి. పొగాకు వ్యసనం నుంచి బయటపడాలనుకునే వారికి సమాజం కూడా అండగా నిలవాలి. చాలామంది మానేయాలని కోరుకున్నా, శారీరకంగా, మానసికంగా ఎదురయ్యే ఇబ్బందుల కారణంగా మళ్లీ అదే అలవాటుకు లోనవుతుంటారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, వైద్యుల సలహాలు, స్నేహితుల సహకారం ఇలాంటి సందర్భాల్లో ఎంతో ఉపయోగపడతాయి. వ్యసనాన్ని ఒక నేరంగా కాకుండా ఆరోగ్య సమస్యగా చూడడం ద్వారా మరింత మందికి సహాయం చేయగలుగుతాం. ఈ దృక్పథం సమాజంలో పెరగాల్సిన అవసరం ఉంది. ప్రపంచ యాంటీ టొబాకో డే ఒక రోజుకు మాత్రమే పరిమితమయ్యే కార్యక్రమం కాదు. ఇది ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సంబంధించిన నిరంతర ఉద్యమం. పొగాకు వినియోగం వల్ల కలిగే ప్రమాదాలను గుర్తించడం మాత్రమే కాకుండా, వాటిని నివారించే చర్యలు తీసుకోవడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత. వ్యక్తి, కుటుంబం, సమాజం, ప్రభుత్వం కలిసి పనిచేసినప్పుడే పొగాకు ముప్పును సమర్థంగా ఎదుర్కోగలం.

# చిలుకల కోసం చైతన్యం

- **పక్షుల రక్షణ అవసరం**
- **ప్రకృతికి మిత్రులైన చిలుకలు**
- **భవిష్యత్తుకు సంరక్షణ బాట**

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ చిలుకల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రకృతిలో అత్యంత అందమైన, తెలివైన పక్షులలో చిలుకలు ఒకటి. ఆకుపచ్చని రంగు, చురుకుదనం, మనుషుల మాటలను అనుకరించే ప్రత్యేక సామర్థ్యం కారణంగా ఇవి చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అందరినీ ఆకట్టుకుంటాయి. ప్రపంచంలోని అనేక దేశాల్లో వందలాది రకాల చిలుక జాతులు కనిపిస్తాయి. అడవులు, పర్వత ప్రాంతాలు, వ్యవసాయ క్షేత్రాలు, గ్రామీణ ప్రాంతాలు వంటి విభిన్న వాతావరణాల్లో ఇవి జీవిస్తుంటాయి. అయితే ఇటీవలి కాలంలో అనేక చిలుక జాతులు అంతరించిపోతున్నాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిలుకల సంరక్షణపై అవగాహన పెంచేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుతున్నారు. చిలుకలు కేవలం అందాన్ని పంచే పక్షులు మాత్రమే కావు. ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. పండ్లు, విత్తనాలు తినే సమయంలో అవి వివిధ ప్రాంతాలకు విత్తనాలను వ్యాపింపజేస్తాయి. దీనివల్ల కొత్త మొక్కలు పెరిగే అవకాశం కలుగుతుంది. అడవుల పునరుత్పత్తిలో చిలుకల పాత్ర ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తారు. కొన్ని ప్రాంతాల్లో చిలుకల సంఖ్య తగ్గిపోవడం వల్ల అక్కడి జీవవైవిధ్యంపై కూడా ప్రభావం పడుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే ప్రకృతికి మిత్రులుగా చిలుకలను గుర్తించి వాటిని రక్షించాల్సిన అవసరం ఉంది.

ప్రపంచవ్యాప్తంగా చిలుకలకు అతి పెద్ద ప్రమాదంగా మారింది అక్రమ వ్యాపారం. రంగురంగుల రూపం కారణంగా చాలా మంది చిలుకలను పెంపుడు పక్షులుగా ఉంచాలని కోరుకుంటారు. దీనిని అవకాశంగా తీసుకుని కొందరు అడవుల్లో చిలుకలను పట్టుకుని అక్రమంగా విక్రయిస్తున్నారు. చిన్న పిల్ల చిలుకలను గూళ్ల నుంచి తీసుకువచ్చి మార్కెట్లలో అమ్మడం వల్ల వాటి సహజ జీవన చక్రం దెబ్బతింటోంది. అనేక చిలుకలు రవాణా సమయంలోనే ప్రాణాలు కోల్పోతున్నాయి. ఈ అక్రమ వ్యాపారం కారణంగా కొన్ని అరుదైన జాతులు అంతరించిపోయే స్థితికి చేరుకున్నాయి. అడవుల నరికివేత కూడా చిలుకల మనుగడకు పెద్ద సవాలుగా మారింది. పట్టణీకరణ, పరిశ్రమల విస్తరణ, రహదారుల నిర్మాణం కోసం విస్తృతంగా చెట్లను తొలగిస్తున్నారు. దీంతో చిలుకలకు అవసరమైన గూళ్లు కట్టుకునే ప్రదేశాలు తగ్గిపోతున్నాయి. పండ్ల చెట్లు, పెద్ద వృక్షాలు లేకపోవడం వల్ల ఆహారం కూడా దొరకడం కష్టమవుతోంది. ఒకప్పుడు గ్రామాల్లో గుంపులుగా కనిపించే చిలుకలు ఇప్పుడు చాలా ప్రాంతాల్లో అరుదుగా దర్శనమిస్తున్నాయి. ప్రకృతి వనరులను విచక్షణారహితంగా వినియోగించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని నిపుణులు చెబుతున్నారు.

భారతదేశంలో పచ్చ చిలుకలు, రామ చిలుకలు ప్రజలకు బాగా పరిచయం. పురాణాలు, జానపద కథలు, సాహిత్యంలో కూడా చిలుకలకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రేమ, అందం, ప్రకృతి సౌందర్యానికి చిలుకలను ప్రతీకగా భావిస్తారు. అనేక దేవాలయ శిల్పాల్లో, చిత్రకళలో చిలుకల ప్రతిరూపాలు కనిపిస్తాయి. గ్రామీణ జీవనంలో చిలుకల కిలకిలారావాలు సహజ వాతావరణానికి అందాన్ని తీసుకువస్తాయి. అందువల్ల చిలుకల సంరక్షణ అనేది కేవలం పక్షులను కాపాడటం మాత్రమే కాదు, మన సంస్కృతి, ప్రకృతి వారసత్వాన్ని కూడా రక్షించడమే. ప్రపంచ చిలుకల దినోత్సవం సందర్భంగా పర్యావరణ సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తాయి. విద్యార్థులకు పక్షుల ప్రాముఖ్యతను వివరించే సదస్సులు, చిత్రలేఖన పోటీలు, ప్రకృతి విహార యాత్రలు నిర్వహిస్తుంటారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా చిలుకల సంరక్షణపై ప్రచారం జరుగుతోంది. ప్రజల్లో చైతన్యం పెరిగితేనే పక్షుల రక్షణ సాధ్యమవుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా యువతలో ప్రకృతి పట్ల బాధ్యత పెంపొందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు.

చిలుకల రక్షణ కోసం ప్రతి వ్యక్తి తన వంతు బాధ్యత నిర్వర్తించవచ్చు. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటడం, పండ్ల చెట్లను పెంచడం, పక్షులకు నీరు అందుబాటులో ఉంచడం వంటి చిన్న చర్యలు కూడా ఎంతో ఉపయోగపడతాయి. అడవుల్లో పట్టుబడిన చిలుకలను కొనుగోలు చేయకపోవడం కూడా పెద్ద సహకారమే. అక్రమ వ్యాపారం కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించడం ద్వారా పక్షులను రక్షించవచ్చు. ప్రకృతిని ప్రేమించే ప్రతి ఒక్కరూ ఈ దిశగా ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ప్రపంచ చిలుకల దినోత్సవం మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది. భూమిపై ఉన్న ప్రతి జీవికి జీవించే హక్కు ఉందని గుర్తుచేస్తుంది. ప్రకృతి సమతుల్యతను కాపాడాలంటే చిలుకల వంటి పక్షులను సంరక్షించడం తప్పనిసరి. అడవులను రక్షించడం, చెట్లను పెంచడం, అక్రమ వేటను అరికట్టడం ద్వారా మాత్రమే భవిష్యత్ తరాలకు చిలుకల అందాన్ని అందించగలం. నేడు తీసుకునే చిన్న నిర్ణయాలు రేపటి ప్రకృతి సంపదను కాపాడగలవు. చిలుకల కిలకిలారావాలు ఎప్పటికీ ప్రకృతిలో మారుమోగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# సరిహద్దు భద్రతపై అమిత్ షా సమీక్ష

- భుజ్‌లో ఉన్నతస్థాయి సమావేశం
- అక్రమ చొరబాట్లపై కఠిన హెచ్చరిక
- భద్రతకు కొత్త కార్యాచరణ

కేంద్ర హోంమంత్రి అమిత్ షా గుజరాత్ రాష్ట్రంలోని భుజ్‌లో సరిహద్దు భద్రతకు సంబంధించిన కీలక సమావేశానికి అధ్యక్షత వహించారు. అంతర్జాతీయ సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులు, అక్రమ చొరబాట్లు, స్మగ్లింగ్ నియంత్రణ, తీర భద్రత వంటి అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం, భద్రతా దళాల సమన్వయంతో గుజరాత్ భద్రతా వ్యవస్థలో గణనీయమైన మార్పు వచ్చిందని పేర్కొన్నారు. సరిహద్దు కంచెల నిర్మాణం, సముద్ర భద్రత చర్యలు, కఠిన నిఘా కారణంగా రాష్ట్రంలో అక్రమ చొరబాట్లు, సరిహద్దు దాటి జరిగే స్మగ్లింగ్ పూర్తిగా నియంత్రణలోకి వచ్చాయని అమిత్ షా తెలిపారు. భద్రతా సంస్థలు నిరంతరం అప్రమత్తంగా పనిచేయడం వల్ల సరిహద్దు ప్రాంతాల్లో శాంతి భద్రతలు మెరుగుపడ్డాయని అన్నారు. సరిహద్దు జిల్లాల్లో జనాభా మార్పులను జిల్లా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని హోంమంత్రి ఆదేశించారు. పారిశ్రామిక యూనిట్లు ఏర్పడటం వల్ల సరిహద్దు ప్రాంతాలకు తిరిగి వలసలు పెరగడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. అయితే జనాభా మార్పులపై నిరంతర నిఘా అవసరమని సూచించారు. ప్రతి సరిహద్దు జిల్లాకు ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా ప్రామాణిక కార్యాచరణ విధానాలను రూపొందించాలని అమిత్ షా సూచించారు. ఇప్పటికే స్థిరపడిన అక్రమ చొరబాటుదారులను గుర్తించడం, డ్రోన్లు, మాదకద్రవ్యాల ముప్పును ఎదుర్కోవడం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్థానిక పరిపాలన వ్యవస్థ మరింత చురుకుగా వ్యవహరించాలని చెప్పారు. అంతర్జాతీయ సరిహద్దుకు సున్నా నుంచి పదిహేను కిలోమీటర్ల పరిధిలో ఉన్న అన్ని అక్రమ ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని హోంమంత్రి స్పష్టం చేశారు. సరిహద్దు ప్రాంతాల్లో మతోన్మాదాన్ని ప్రోత్సహించే కేంద్రాలపై కఠిన నిఘా కొనసాగించాలని ఆదేశించారు. చట్ట ఉల్లంఘనల విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని హెచ్చరించారు. ప్రతి జిల్లాలో సరిహద్దు భద్రత సమన్వయ బృందాన్ని ఏర్పాటు చేయాలని అమిత్ షా సూచించారు. ఈ బృందంలో సరిహద్దు భద్రతా దళం, తీర రక్షక దళం, ఆదాయపు పన్ను శాఖ, అమలు సంచాలక విభాగం, బ్యాంకింగ్ ప్రతినిధులు ఉండాలని పేర్కొన్నారు. హవాలా లావాదేవీలు, అనుమానాస్పద ఆర్థిక వ్యవహారాలు, షెల్ కంపెనీలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.



# లక్నోలో నౌసేన శౌర్య వాటిక ప్రారంభం

- ప్రారంభించిన రక్షణ మంత్రి
- సైనిక శక్తికి ప్రతీకగా వాటిక
- యువతకు స్ఫూర్తినిచ్చే ప్రదర్శనలు

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో నూతనంగా ఏర్పాటు చేసిన నౌసేన శౌర్య వాటికను కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. ఈ వాటిక లక్నో నగరానికి కొత్త గుర్తింపుగా నిలవడంతో పాటు దేశభక్తి, సైనిక స్ఫూర్తిని పెంపొందించే కేంద్రంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నౌసేన శౌర్య వాటికలో భారత నౌకాదళానికి సంబంధించిన అనేక పరికరాలు, యుద్ధ వేదికలు, రక్షణ సామగ్రిని ప్రదర్శనకు ఉంచినట్లు రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. వీటిని సందర్శించే ప్రజలు భారత సైనిక శక్తి, సాంకేతిక సామర్థ్యాన్ని ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలు ముఖ్యంగా యువతలో దేశ రక్షణ పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని ఆయన అన్నారు. సైన్యంలో సేవలందించాలనే స్ఫూర్తిని కలిగించేలా ఈ వాటిక రూపొందించబడిందని తెలిపారు. దేశ భద్రత కోసం నౌకాదళం చేస్తున్న సేవలను ప్రజలకు చేరువ చేసే ప్రయత్నంగా దీనిని అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు రూపకల్పన, అభివృద్ధిలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని రక్షణ మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించిందని ప్రశంసించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. నౌసేన శౌర్య వాటికలో ఏర్పాటు చేసిన ప్రదర్శనల ద్వారా భారత నౌకాదళ చరిత్ర, సాంకేతిక అభివృద్ధి, రక్షణ రంగ పురోగతి గురించి సందర్శకులు అవగాహన పొందే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు, యువతకు ఇది ఒక ప్రత్యేక అధ్యయన కేంద్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు. దేశభక్తి భావాలను పెంపొందించడంతో పాటు భారత సైనిక దళాల గొప్పతనాన్ని చాటిచెప్పే వేదికగా నౌసేన శౌర్య వాటిక నిలవాలని రాజ్‌నాథ్ సింగ్ ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇది లక్నో నగరంలోని ప్రధాన ఆకర్షణల్లో ఒకటిగా మారుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఆపరేషన్ సిందూర్‌కు దళాలు సిద్ధం

- సరిహద్దుల్లో అప్రమత్తంగా త్రివిధ దళాలు
- శత్రు కదలికలపై నిరంతర నిఘా
- ప్రజల మద్దతు ఎంతో కీలకం




భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది శనివారం కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసిన ఆయన, అవసరమైతే ఆపరేషన్ సిందూర్ 2.0 చేపట్టేందుకు త్రివిధ దళాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. సరిహద్దు ప్రాంతాల్లో ప్రస్తుతం నెలకొన్న ప్రశాంతతను శాశ్వత పరిస్థితిగా భావించరాదని, అది కేవలం తాత్కాలికమే కావచ్చని హెచ్చరించారు. దేశ భద్రతకు సంబంధించిన ప్రతి అంశాన్ని సైన్యం నిశితంగా పరిశీలిస్తోందని జనరల్ ద్వివేది తెలిపారు. శత్రు దేశాల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగుతోందని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సైనిక దళాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు వెల్లడించారు. ఆధునిక యుద్ధ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని త్రివిధ దళాల మధ్య సమన్వయాన్ని మరింత పెంచుతున్నామని ఆయన తెలిపారు. భూసేన, నౌకాదళం, వైమానిక దళం మధ్య సమాచార మార్పిడి, వ్యూహాత్మక సహకారం పటిష్ఠంగా కొనసాగుతోందన్నారు. యుద్ధరంగంలో ప్రతి కదలికను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సైనికుల భద్రతతో పాటు పౌరుల రక్షణ కూడా తమకు అత్యంత ప్రాధాన్యమని జనరల్ ద్వివేది స్పష్టం చేశారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేలా అన్ని రక్షణ దళాలు ఇరవై నాలుగు గంటలూ అప్రమత్తంగా పనిచేస్తున్నాయని తెలిపారు. దేశ రక్షణ విషయంలో ఎల్లప్పుడూ అత్యున్నత స్థాయి సన్నద్ధత కొనసాగుతోందన్నారు.

సమాచార యుద్ధం ఆధునిక కాలంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్న ఆయన, ఈ రంగంలో విజయం సాధించాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని అన్నారు. సామాజిక మాధ్యమాలు, ఇతర వేదికల ద్వారా వ్యాపించే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. అధికారిక వర్గాల ద్వారా విడుదలయ్యే సమాచారాన్నే ప్రజలు విశ్వసించాలని కోరారు. దేశ ప్రజలంతా ఒకే లక్ష్యంతో ముందుకు సాగినప్పుడే శత్రువుల కుట్రలను సమర్థంగా తిప్పికొట్టగలమని జనరల్ ద్వివేది పేర్కొన్నారు. జాతీయ భద్రత అనేది కేవలం సైన్యం బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత కూడా అని అన్నారు. దేశ రక్షణ విషయంలో ప్రజల అప్రమత్తత, ఐక్యత, విశ్వాసం ఎంతో కీలకమని ఆయన స్పష్టం చేశారు.

# జూన్ 1 నుంచి మారనున్న యూపీఐ, ఏటీఎం నిబంధనలు..

జూన్ నెల ప్రారంభం కానుండటంతో దేశవ్యాప్తంగా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పలు కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. ముఖ్యంగా యూపీఐ మరియు ఏటీఎం సేవలకు సంబంధించిన కొత్త నిబంధనలు వినియోగదారులపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్నాయి. డిజిటల్ చెల్లింపులు, నగదు ఉపసంహరణలు చేసే వారు ఈ మార్పులపై ముందుగానే అవగాహన కలిగి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.




యూపీఐ లావాదేవీల్లో పారదర్శకత పెంచే లక్ష్యంతో కొత్త విధానం అమల్లోకి రానుంది. ఇకపై యూపీఐ ద్వారా డబ్బులు పంపే సమయంలో లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో నమోదైన అసలు పేరు స్పష్టంగా కనిపించనుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినా, మొబైల్ నంబర్ ద్వారా చెల్లింపు చేసినా బ్యాంకు రికార్డుల్లో ఉన్న పేరునే వినియోగదారులు చూడగలుగుతారు. ఈ మార్పుతో తప్పు ఖాతాలకు డబ్బులు పంపే ప్రమాదం తగ్గడంతో పాటు మోసాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

మరోవైపు ఏటీఎం సేవల్లో కూడా కొన్ని మార్పులు అమల్లోకి రానున్నాయి. పలు బ్యాంకులు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో ఉచిత లావాదేవీల పరిమితిని తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. నగదు ఉపసంహరణ, బ్యాలెన్స్ పరిశీలన, మినీ స్టేట్‌మెంట్ వంటి సేవలపై అదనపు చార్జీలు విధించే అవకాశం ఉంది. ముఖ్యంగా తరచూ ఇతర బ్యాంకుల ఏటీఎంలను వినియోగించే ఖాతాదారులు ఈ మార్పులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచిస్తున్నారు.

ఆర్థిక లావాదేవీలను సురక్షితంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కొత్త నిబంధనలను ముందుగానే తెలుసుకుని అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని బ్యాంకింగ్ నిపుణులు పేర్కొంటున్నారు.




# విక్రయాల కోసం భారీ తగ్గింపు.. టెస్లా మోడల్ వై ధరలో రూ.9 లక్షల కోత..!

ప్రపంచ ప్రఖ్యాత విద్యుత్ వాహన తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లో తన మోడల్ వై కారుపై భారీ ధర తగ్గింపును ప్రకటించింది. దేశీయ మార్కెట్లో ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగకపోవడంతో కంపెనీ ఏకంగా రూ.9 లక్షల మేర ధరను తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం భారత విద్యుత్ వాహన రంగంలో చర్చనీయాంశంగా మారింది.భారీ ధరల కారణంగా వినియోగదారులు ఇతర కంపెనీల విద్యుత్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో టెస్లా తన వ్యూహాన్ని మార్చుకుంది. కొత్త ధరలతో మోడల్ వై వాహనం మరింత మందికి అందుబాటులోకి రానుంది. అలాగే భారత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వాహనాల శ్రేణిలో కూడా మార్పులు చేస్తూ కొత్త వేరియంట్లను ప్రవేశపెట్టేందుకు సంస్థ సిద్ధమవుతోంది. ధరల తగ్గింపు వల్ల విద్యుత్ వాహనాల విభాగంలో పోటీ మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా దేశీయ సంస్థలు మరియు ఇతర అంతర్జాతీయ బ్రాండ్లపై ఈ నిర్ణయం ప్రభావం చూపే అవకాశముంది. పెరుగుతున్న పోటీ కారణంగా వినియోగదారులకు మరిన్ని ప్రయోజనాలు లభించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. భారతదేశంలో విద్యుత్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతున్న తరుణంలో టెస్లా ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. తక్కువ ధరలకు అత్యాధునిక సాంకేతికత కలిగిన వాహనాలను అందించడం ద్వారా మార్కెట్ వాటాను పెంచుకోవడమే కంపెనీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. కొత్త ధరలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు సమాచారం. ఈ భారీ ధర తగ్గింపు తర్వాత టెస్లా విక్రయాలు ఎంత మేర పెరుగుతాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# సీబీఎస్ఈ పోర్టల్‌పై సైబర్ దాడి

- **రీవాల్యుయేషన్‌లో గందరగోళం**
- **ఫీజుల్లో భారీ వ్యత్యాసం**
- **అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం**





సీబీఎస్ఈ రీవాల్యుయేషన్ ప్రక్రియకు సంబంధించిన పేమెంట్ పోర్టల్‌పై సైబర్ దాడి జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ ఘటనలో దాదాపు 50 మంది విద్యార్థుల ఖాతాల్లోకి అనధికారిక ప్రవేశాలు జరిగినట్లు గుర్తించినట్లు తెలిపింది. దీంతో రీవాల్యుయేషన్ ప్రక్రియపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షల మూల్యాంకనంలో కొత్తగా అమలు చేసిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానంపై కొందరు విద్యార్థులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తమ జవాబు పత్రాలు తారుమారయ్యాయని ఆరోపిస్తూ బోర్డును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన సీబీఎస్ఈ విద్యార్థులకు స్కాన్ చేసిన జవాబు పత్రాల ప్రతులను అందించి, వాటిని పరిశీలించిన తర్వాత రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది.

అయితే రీవాల్యుయేషన్ ఫీజు చెల్లింపుల కోసం ఉపయోగిస్తున్న పేమెంట్ పోర్టల్‌పైనే సైబర్ దాడి జరగడంతో సమస్యలు మరింత తీవ్రమయ్యాయి. ఫీజు చెల్లింపుల సమయంలో అసాధారణ వ్యత్యాసాలు కనిపించినట్లు అధికారులు తెలిపారు. సాధారణంగా చెల్లించాల్సిన మొత్తానికి బదులుగా కొందరికి కేవలం ఒక రూపాయి, మరికొందరికి దాదాపు అరవై ఎనిమిది వేల రూపాయల వరకు చెల్లింపు మొత్తం చూపించినట్లు వెల్లడించారు. ఈ సమస్య ప్రధానంగా హెచ్‌డీఎఫ్‌సీ చెల్లింపు గేట్‌వేతో అనుసంధానమైన భాగంలోనే కనిపించినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే సాంకేతిక నిపుణులు అప్రమత్తమయ్యారు. ఐఐటీ మద్రాస్, ఐఐటీ కాన్పూర్‌కు చెందిన నిపుణులు సమస్య మూలాలను గుర్తించి పరిష్కరించే పనిలో నిమగ్నమయ్యారు.

ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానం అమలులో భాగంగా మొత్తం తొంభై ఎనిమిది లక్షలకు పైగా జవాబు పత్రాలకు సంబంధించిన దాదాపు నలభై కోట్ల పేజీలను స్కాన్ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వీటిలో అరవై ఎనిమిది వేల పత్రాల్లో నాణ్యత సమస్యలు తలెత్తడంతో మళ్లీ స్కానింగ్ నిర్వహించినట్లు వెల్లడించింది. విద్యార్థుల ఫిర్యాదుల ఆధారంగా మొత్తం ఇరవై జవాబు పత్రాలు తారుమారైనట్లు గుర్తించి, సంబంధిత విద్యార్థులకు సరైన జవాబు పత్రాలను అందించినట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ ఘటనతో సీబీఎస్ఈ డిజిటల్ వ్యవస్థల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థుల సమాచారం, పరీక్షల నిర్వహణకు సంబంధించిన కీలక వ్యవస్థలపై మరింత పటిష్ఠమైన సైబర్ భద్రతా చర్యలు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

# భార్య వేధింపులతో కారుణ్య మరణం అభ్యర్థన

- **డబ్బుల కోసం ఒత్తిడి**
- **తప్పుడు కేసుల ఆరోపణ**
- **కలెక్టర్‌కు వినతి పత్రం**



గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ నగరంలో ఓ వ్యక్తి చేసిన వినతి ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. భార్య, అత్త వేధింపులు భరించలేక తనకు కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతూ లేఖ రాయడం సంచలనంగా మారింది. కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురయ్యానని, జీవితం కొనసాగించడం కష్టంగా మారిందని ఆయన తన వినతిలో పేర్కొన్నారు. సూరత్‌కు చెందిన కిరిట్ పటేల్‌కు గత ఏడాది స్థానిక మహిళతో వివాహం జరిగింది. వీరిద్దరికీ ఇది మూడో వివాహం కావడం గమనార్హం. వివాహం జరిగిన నాటి నుంచి భార్యతో పాటు అత్త కూడా డబ్బుల కోసం నిరంతరం ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆర్థిక డిమాండ్లు నెరవేర్చకపోతే వివిధ రకాలుగా మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు.

తనపై ఆధారరహిత ఆరోపణలు చేస్తూ తప్పుడు ఫిర్యాదులు నమోదు చేస్తున్నారని పటేల్ పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలను దుర్వినియోగం చేస్తూ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితుల వల్ల తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నానని, సామాజికంగా కూడా అవమానాలు ఎదుర్కొంటున్నానని తన లేఖలో వివరించారు. అంతకుముందు తన భార్య వివాహం చేసుకున్న వ్యక్తుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. వారిని కూడా ఇదే తరహాలో వేధించి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం తన వద్ద ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని అధికారులను కోరారు.

భార్య వేధింపులపై ఇప్పటికే పోలీసులను ఆశ్రయించినప్పటికీ సరైన స్పందన రాలేదని పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని, తన వాదనను అధికారులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. దీంతో చివరి మార్గంగా జిల్లా కలెక్టర్‌కు లేఖ రాయాల్సి వచ్చిందని తెలిపారు. గృహ హింసకు గురవుతున్న పురుషులకు కూడా తగిన చట్టపరమైన రక్షణ అవసరమని ఆయన తన వినతిలో ప్రస్తావించారు. ప్రస్తుతం తనకు కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని కోరిన ఈ అభ్యర్థనపై జిల్లా అధికారులు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారితీస్తూ కుటుంబ వివాదాలు, చట్టాల అమలు, పురుషుల హక్కుల అంశాలపై మరోసారి చర్చ మొదలయ్యేలా చేసింది.


# చైనా అణు స్థావరాల విస్తరణ



- **ఎడారిలో భారీ నిర్మాణాలు**
- **పెరుగుతున్న క్షిపణి సామర్థ్యాలు**
- **శాటిలైట్ చిత్రాల్లో వెల్లడి**

చైనాలోని జిన్‌జియాంగ్ ప్రాంతంలో ఉన్న ఎడారి ప్రాంతాల్లో భారీ స్థాయిలో సైనిక నిర్మాణాలు కొనసాగుతున్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చిన శాటిలైట్ చిత్రాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా అణు ఆయుధాలకు సంబంధించిన స్థావరాల వద్ద కొత్త నిర్మాణాలు చేపడుతున్నట్లు అంతర్జాతీయ రక్షణ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ పరిణామం ప్రపంచ వ్యాప్తంగా వ్యూహాత్మక వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది. ఉయ్‌గర్ ప్రాంతంలోని సైనిక సముదాయాల వద్ద కొత్త లాంచ్ ప్యాడ్లు, భూగర్భ బంకర్లు, సమాచార ప్రసార కేంద్రాలు నిర్మిస్తున్నట్లు శాటిలైట్ చిత్రాల్లో కనిపించినట్లు నివేదికలు వెల్లడించాయి. దీర్ఘశ్రేణి క్షిపణుల నిర్వహణకు అనువుగా ఈ నిర్మాణాలు రూపొందిస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా ఖండాన్ని చేరగల సామర్థ్యం కలిగిన క్షిపణుల మోహరింపుకు ఈ ప్రాంతాన్ని మరింత బలోపేతం చేస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. నివేదికల ప్రకారం ఉయ్‌గర్ ప్రాంతంలోని సైనిక కేంద్రం వద్ద దాదాపు ఎనభైకి పైగా లాంచ్ ప్యాడ్ల నిర్మాణం కొనసాగుతోంది. దీనితో పాటు మొబైల్ క్షిపణి ప్రయోగ వాహనాలు, వైమానిక రక్షణ వ్యవస్థలు, ఆధునిక సైనిక పరికరాల మోహరింపును కూడా చైనా పెంచుతున్నట్లు సమాచారం. గతంలో ఈ ప్రాంతంలో ఇంత విస్తృత స్థాయిలో నిర్మాణాలు కనిపించలేదని నిపుణులు చెబుతున్నారు. శాటిలైట్ దృశ్యాల విశ్లేషణలో భాగంగా ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలు, ఉపగ్రహ సమాచార కేంద్రాలు, కమాండ్ నియంత్రణ కేంద్రాల నిర్మాణం కూడా కొనసాగుతున్నట్లు గుర్తించారు. ఆధునిక యుద్ధ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సైనిక మౌలిక వసతులను బలోపేతం చేసే ప్రయత్నంగా దీనిని విశ్లేషిస్తున్నారు. భవిష్యత్తులో వ్యూహాత్మక ప్రతిస్పందన సామర్థ్యాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా ఈ చర్యలు ఉన్నట్లు భావిస్తున్నారు. అణు దళాల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు ప్రత్యేక రక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నట్లు రక్షణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎడారి ప్రాంతంలోని వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ నిర్మాణాలు కొనసాగుతున్నాయని అంతర్జాతీయ భద్రతా పరిశోధకులు పేర్కొంటున్నారు. భూగర్భ సదుపాయాలు, అత్యవసర కమాండ్ కేంద్రాలు కూడా ఈ ప్రణాళికలో భాగమై ఉండవచ్చని చెబుతున్నారు. చైనా చేపడుతున్న ఈ నిర్మాణాలు ప్రపంచ వ్యాప్తంగా వ్యూహాత్మక సమతౌల్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జిన్‌జియాంగ్ ప్రాంతంతో పాటు ఘాన్సు ప్రావిన్సులోని అణు స్థావరాల భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా ఈ చర్యలు సాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ నిర్మాణాలపై చైనా ప్రభుత్వం అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించలేదు.

# ఇరాన్‌పై యూఏఈ రహస్య దాడులు?




- **వెలుగులోకి వచ్చిన సంచలన కథనం**
- **ఇంధన కేంద్రాలపై లక్ష్యంగా దాడులు**
- **గల్ఫ్ దేశాల్లో పెరుగుతున్న ఉద్రిక్తతలు**

ఇరాన్‌పై ఇప్పటి వరకు అమెరికా, ఇజ్రాయెల్ మాత్రమే ప్రత్యక్షంగా సైనిక చర్యలు చేపట్టాయని ప్రపంచ వ్యాప్తంగా భావిస్తూ వచ్చారు. అయితే తాజాగా వెలుగులోకి వచ్చిన అంతర్జాతీయ మీడియా కథనాలు పశ్చిమాసియా దేశమైన యూఏఈ కూడా రహస్యంగా ఇరాన్‌పై దాడులు నిర్వహించినట్లు సూచిస్తున్నాయి. ఈ అంశం అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ ఆరోపణలను స్వతంత్రంగా ధృవీకరించలేదని పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు పేర్కొన్నాయి. వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనాన్ని ఉటంకిస్తూ వచ్చిన నివేదికల ప్రకారం, అమెరికా, ఇజ్రాయెల్ అందించిన నిఘా సమాచారంతో యూఏఈ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. హర్మూజ్ జలసంధి పరిసర ప్రాంతాల్లోని ఇరాన్‌కు చెందిన ఇంధన మౌలిక వసతులు, ఆయిల్ రిఫైనరీలు, పెట్రోకెమికల్ కేంద్రాలపై లక్ష్యంగా దాడులు జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా లావన్ దీవిలోని రిఫైనరీపై దాడి జరిగినట్లు నివేదికలు పేర్కొన్నాయి.

ఇరాన్ గతంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో దాడులు నిర్వహించింది. యూఏఈ కూడా అమెరికా, ఇజ్రాయెల్‌కు సహకరిస్తోందనే ఆరోపణలతో ఇరాన్ తరచూ లక్ష్యంగా చేసుకున్నట్లు కథనాలు చెబుతున్నాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి యూఏఈపై వేల సంఖ్యలో డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించినట్లు పలు నివేదికలు వెల్లడించాయి. కొన్ని దాడులు చమురు నిల్వ కేంద్రాలు, పారిశ్రామిక ప్రాంతాలు, పౌర మౌలిక వసతులపై ప్రభావం చూపినట్లు సమాచారం. ఇరాన్ దాడులకు ప్రతీకారంగానే యూఏఈ కఠిన వైఖరి అవలంబించినట్లు తెలుస్తోంది. గల్ఫ్ దేశాలన్నీ కలిసి ఇరాన్‌పై ఉమ్మడి సైనిక చర్యకు దిగాలని యూఏఈ ప్రతిపాదించిందని, అయితే సౌదీ అరేబియా దీనికి మద్దతు ఇవ్వలేదని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ప్రాంతీయ స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని ఉద్రిక్తతలు మరింత పెరగకుండా చూడాలని సౌదీ భావించినట్లు సమాచారం.

యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో యూఏఈ, ఇజ్రాయెల్ మధ్య రక్షణ సహకారం మరింత బలపడినట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్ క్షిపణి దాడులను ఎదుర్కొనేందుకు అధునాతన వైమానిక రక్షణ వ్యవస్థల వినియోగంపై ఇరు దేశాలు కలిసి పనిచేసినట్లు సమాచారం. ప్రాంతీయ భద్రతా పరిస్థితులపై ఉన్నతస్థాయి చర్చలు కూడా జరిగినట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఈ అంశాలపై అధికారిక ప్రకటనలు మాత్రం వెలువడలేదు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో యూఏఈ పాత్రపై వస్తున్న ఈ కథనాలు కొత్త చర్చకు దారితీశాయి. ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఘర్షణల్లో గల్ఫ్ దేశాల ప్రమేయం పెరుగుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ సమాచారంలో చాలా భాగం మీడియా నివేదికల ఆధారంగా మాత్రమే వెలువడినందున అధికారిక ధృవీకరణ కోసం అంతర్జాతీయ వర్గాలు ఎదురు చూస్తున్నాయి.




# శంషాబాద్‌లో అత్యవసరంగా దిగిన విమానం

- **సాంకేతిక లోపంతో మారిన మార్గం..భయాందోళనలకు గురైన ప్రయాణికులు సురక్షిత ల్యాండింగ్‌తో ఊరట**

శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగోకు చెందిన ఓ విమానం అత్యవసరంగా ల్యాండ్ కావడంతో కొద్దిసేపు ఉత్కంఠ నెలకొంది. బెంగళూరు నుంచి నాగపూర్‌కు బయలుదేరిన ఈ విమానంలో ప్రయాణ మధ్యలో సాంకేతిక సమస్య తలెత్తడంతో పైలట్ అప్రమత్తమై వెంటనే విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతి మంజూరు చేశారు. విమానంలో మొత్తం 126 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. సాంకేతిక లోపం గురించి సమాచారం అందడంతో ప్రయాణికుల్లో ఆందోళన నెలకొంది. అయితే పైలట్ పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొంటూ విమానాన్ని శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు.


అధికారుల సూచనల మేరకు విమానాశ్రయంలో అత్యవసర సేవలను సిద్ధం చేశారు. అగ్నిమాపక సిబ్బంది, వైద్య బృందాలు, భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండగా విమానం సురక్షితంగా రన్‌వేపై దిగింది. దీంతో ప్రయాణికులు, విమాన సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే సాంకేతిక నిపుణులు తనిఖీలు చేపట్టారు. లోపానికి గల కారణాలను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రయాణికులను సురక్షితంగా విమానం నుంచి దించి అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు విమానాశ్రయ వర్గాలు తెలిపాయి.

కాగా, వరుసగా రెండు రోజులుగా శంషాబాద్ విమానాశ్రయంలో విమానాలకు సాంకేతిక సమస్యలు తలెత్తడం చర్చనీయాంశంగా మారింది. నిన్న ఉదయం శంషాబాద్ నుంచి జగ్‌దల్‌పూర్‌కు బయలుదేరిన ఓ విమానంలో సాంకేతిక లోపం గుర్తించగా, అనంతరం రాజమండ్రికి వెళ్లాల్సిన మరో విమానంలో కూడా సమస్య తలెత్తింది. తాజాగా మరో విమానం అత్యవసరంగా ల్యాండ్ కావడంతో విమాన భద్రతా ప్రమాణాలపై ప్రయాణికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే అన్ని సందర్భాల్లోనూ పైలట్లు, సాంకేతిక బృందాలు అప్రమత్తంగా వ్యవహరించడం వల్ల ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం సంబంధిత విమానాల్లో తలెత్తిన లోపాలపై సాంకేతిక పరిశీలనలు కొనసాగుతున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# ‘రోమాంచకం’తో సందీప్ కొత్త ప్రయాణం



‘అర్జున్ రెడ్డి’, ‘యానిమల్’ చిత్రాలతో సంచలన విజయాలు అందుకున్న దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఇప్పుడు కొత్త బాధ్యతలో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. యువ నటులు సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ‘రోమాంచకం’ చిత్రానికి ఆయన సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రానికి సంబంధించిన తొలి పోస్టర్‌ను సందీప్ రెడ్డి వంగా సామాజిక మాధ్యమాల ద్వారా విడుదల చేశారు. అలాగే సినిమాపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ భావోద్వేగభరిత సందేశాన్ని కూడా పంచుకున్నారు. చిత్ర పరిశ్రమలో పంపిణీదారుడిగా ఇది తన తొలి ప్రాజెక్ట్ అని వెల్లడించారు. కథ వింటున్న సమయంలో తాను ఎంతగానో నవ్వుకున్నానని, అయితే ఆ వినోదం వెనుక బలమైన భావోద్వేగం కూడా దాగి ఉందని పేర్కొన్నారు. భద్రకాళి పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రం సంగీత ప్రధాన ప్రేమ కథా హాస్య చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రాబోతోందని తెలిపారు. మరోవైపు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం ‘స్పిరిట్’పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఇటీవల విడుదలైన ప్రచార దృశ్యాల్లో ప్రభాస్ కొత్త రూపంలో కనిపించడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. పొడవాటి జుట్టు, గడ్డం, తీవ్రమైన రూపంతో కనిపించిన ప్రభాస్ పాత్రపై చర్చ సాగుతోంది. ఈ చిత్రంలో తృప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు.

# మూడే సినిమాలు.. క్రేజ్ మాత్రం తగ్గలేదు..!



సినీ పరిశ్రమలో అందం, అభినయం ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో అవకాశాలు దక్కని నటీమణులు చాలామంది ఉంటారు. అలాంటి వారిలో నటి ప్రియా ప్రకాష్ వారియర్ కూడా ఒకరు. తక్కువ సినిమాలే చేసినప్పటికీ భారీ అభిమాన గణాన్ని సొంతం చేసుకుని తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఒకే ఒక్క సన్నివేశంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ప్రియా ప్రకాష్ వారియర్, కన్నుకొట్టిన దృశ్యంతో సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారారు. ఆ వీడియోతో ఆమె పేరు ఒక్కసారిగా దేశవ్యాప్తంగా మార్మోగింది. తొలి చిత్రంతోనే యువతలో విపరీతమైన ఆదరణ సంపాదించారు. తర్వాత పలు భాషల్లో అవకాశాలు వచ్చినప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు మాత్రం దక్కలేదు. తెలుగులో చేసిన చిత్రాలు ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోవడంతో స్టార్ కథానాయికల జాబితాలో నిలవలేకపోయారు. అయినా కూడా ఆమెకు సామాజిక మాధ్యమాల్లో ఉన్న ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. తరచూ తన ఫొటోలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. ముఖ్యంగా ఆమె ఫ్యాషన్ శైలి, గ్లామర్ ఫొటోలు యువతను ఆకర్షిస్తున్నాయి. సినిమాల్లో విజయాలు ఆశించినంతగా రాకపోయినా, అభిమానుల్లో మాత్రం ప్రియా ప్రకాష్ వారియర్‌కు ప్రత్యేక స్థానం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం ఆమె పంచుకుంటున్న తాజా చిత్రాలు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

# అందంతో ఆకట్టుకుంటున్న జియా శంకర్



టెలివిజన్, సినిమాలు, వెబ్ సిరీస్‌లలో తనదైన గుర్తింపు సంపాదించుకున్న నటి జియా శంకర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. అందం, ఫ్యాషన్ అభిరుచి, సహజమైన నటనతో ఆమెకు ప్రత్యేక అభిమాన వర్గం ఏర్పడింది.

తెలుగు చిత్రంతో తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించిన జియా శంకర్, ఆ తర్వాత తమిళం, మరాఠీ భాషల చిత్రాల్లోనూ నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. వివిధ భాషల్లో విభిన్న పాత్రలు పోషిస్తూ నటిగా తన ప్రతిభను చాటుకున్నారు.

హిందీ టెలివిజన్ రంగంలో కూడా ఆమె విజయవంతమైన ప్రస్థానం కొనసాగింది. పలు ప్రముఖ ధారావాహికల్లో నటించి ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. తన సహజ నటనతో చిన్న తెరపై ప్రత్యేక గుర్తింపు సంపాదించారు.

ప్రముఖ వినోద కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత ఆమెకు దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు లభించింది. ఆ కార్యక్రమంలో ఆమె ప్రవర్తన, నిజాయితీ, ఆత్మవిశ్వాసం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

నటనతో పాటు జియా శంకర్ ఫ్యాషన్ ప్రపంచంలో కూడా ప్రత్యేక స్థానం సంపాదించారు. సంప్రదాయ దుస్తులు, ఆధునిక వస్త్రధారణ రెండింటిలోనూ ఆమె తనదైన శైలిని ప్రదర్శిస్తూ అభిమానులను ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా చీరలు, లెహంగాల్లో ఆమె కనిపించే తీరు సామాజిక మాధ్యమాల్లో తరచూ చర్చనీయాంశంగా మారుతోంది. సంప్రదాయం, ఆధునికత కలయికతో కూడిన ఆమె శైలి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in